

నూతన హంగులతో పాఠశాల, తరగతి గదిలో ఏర్పాటు చేసిన డ్యూయెల్ డెస్క్ బెంచీలు

# మారిన రూపురేఖలు

- కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడులు
- 'మన ఊరు-మన బడి'తో పాఠశాలలు కళకళ

కాసిపేట, అక్టోబర్ 29 : సర్కారు బడంటే.. పాడు బడ్డ సున్నం లేని భవనాలు.., కళ తప్పిన తరగతి గదులు.., కనీస బ్లాక్ బోర్డులు, బెంచీలు కనిపించని పరిస్థితి.., మరుగు దొడ్లు, నీటి సౌకర్యం కూడా దిక్కులేని దుస్థితి.. ఉమ్మడి రాష్ట్రంలో ఇంతటి అధ్వాన స్థితిలో విద్యార్థులు చదువులు సాగించారు. కానీ, తెలంగాణ రాష్ట్రం వచ్చాక పరిస్థితి మారింది. సీఎం కేసీఆర్ నేతృత్వంలో ప్రభుత్వం సర్కారు బడుల రూపురేఖలు మార్చింది. పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా 'మన ఊరు-మన బడి'తో నూతన హంగులు దిద్దింది. కార్పొరేట్‌కు దీటుగా విద్యతో పాటు సౌకర్యాల ఏర్పాటుకు సిద్ధం చేసింది.

కాసిపేట మండలం సోనాపూర్ ప్రైమరీ పాఠశాలను 'మన ఊరు-మన బడి' కింద రూ.21 లక్షలతో అభివృద్ధి చేశారు. అలాగే పల్లంగూడ ప్రైమరీ పాఠశాలకు రూ.26 లక్షలతో పనులు చేశారు. తాగునీటి సౌకర్యం, గ్రీన్ చాక్ బోర్డులు, పాఠశాలకు పెయింటింగ్స్, మేజర్, మైనర్ మరమ్మత్తులు, కిచెన్ షెడ్డు, బాల బాలికలకు వేర్వేరు టాయిలెట్స్, కాంపౌండ్ వాల్ నిర్మించారు. చేశారు. డ్యూయెల్ డెస్క్ బెంచీలను కూడా ఏర్పాటు చేశారు. లంబాడీతండా(ఎస్) హైస్కూల్‌కు రూ.23 లక్షలు, లంబాడీ తండా(ఎస్) ప్రైమరీ పాఠశాలకు రూ.8.34 లక్షలతో తాగునీటి సౌకర్యం మోటర్ కనెక్షన్, గ్రీన్ చాక్ బోర్డులు, పెయింటింగ్స్, మేజర్, మైనర్ మరమ్మత్తులు, డైనింగ్ హాల్ నిర్మించారు. డిజిటల్ విద్యలో భాగంగా సుమారు రూ.16 లక్షలతో మూడు స్మార్ట్ టచ్ టీవీలు ఏర్పాటు చేశారు.

### మహోన్నత కార్యక్రమం..



మన ఊరు-బన బడి ఒక మహోన్నత కార్యక్రమం. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందుబాటులోకి రావడం విద్యార్థులకు వరం. ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే మెరుగైన విద్య అందుతుండగా, ప్రస్తుతం ఈ కార్యక్రమం తీసుకొని అన్ని సౌకర్యాలు కల్పించడం ఆనందంగా ఉంది. గత పాలనలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దారుణంగా ఉండేది. తెలంగాణ ప్రభుత్వం అన్ని హంగులతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేసింది.

**- పల్లె చంద్రయ్య, జడ్పీటీసీ, కాసిపేట**

### చదువుతోనే జీవితంలో మార్పు..



ఎవరికి ఎన్ని ఇచ్చినా వృథానే. మంచి చదువుతోనే మంచి జీవితం లభిస్తుంది. దీనిని తెలంగాణ ప్రభుత్వం గుర్తించి, ప్రభుత్వ పాఠశాలలకు కోట్ల రూపాయలు ఖర్చు చేసి, మెరుగైన విద్య, సదుపాయాలు అందించాలని ఏర్పాట్లు చేసింది. ఇలాంటి సాహసమైన నిర్ణయం తీసుకోవడం వల్ల తెలంగాణాలో విద్యార్థులందరికీ మంచి చదువుతో మంచి జీవితం లభిస్తుంది. కార్పొరేట్‌కు దీటుగా పాఠశాలల్లోనే మంచి విద్య అందుతుండగా, విద్యార్థులకు మంచి భవిష్యత్తు లభిస్తుంది.

**- సపాట్ శంకర్, సర్పంచ్, సోమగూడెం(కే)**

# కాసిపేట.. అభివృద్ధికి బాట

- స్వరాష్ట్రంలో అద్భుత ప్రగతి
- మౌలిక వసతుల్లో మేటి
- ఇంటింటా సంక్షేమ పథకాలు
- రూ.80 లక్షలతో సీసీ రోడ్లు
- సకల సౌకర్యాలతో వైకుంఠధామం

*అరకొర వసతులతో ఇబ్బందులు పడ్డ కాసిపేట.. స్వరాష్ట్రంలో దూసుకుపోతున్నది. తెలంగాణ ప్రభుత్వ హయాంలో ఈ గ్రామం ప్రగతి పథంలో పయనిస్తున్నది. సర్కారు ప్రతి నెలా రూ.2 లక్షలు సమకూరుస్తుండగా, వాటిని సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధిలో పరుగులు పెడుతున్నది. ఇటీవల నిర్మించిన తెలంగాణ క్రీడా ప్రాంగణం.., సకల సౌకర్యాలతో వైకుంఠధామం, పారిశుధ్య నిర్వహణతో ఆదర్శంగా నిలుస్తున్నది.*

**- దండేపల్లి, అక్టోబర్ 29**



తెలంగాణ క్రీడా ప్రాంగణం


నిర్మాణం పూర్తయిన వైకుంఠధామం


ఇటీవల నిర్మించిన సీసీ రోడ్డు

దండేపల్లి మండలంలోని కాసిపేట గ్రామం అభివృద్ధిలో ముందు వరుసలో నిలుస్తున్నది. గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పల్లె ప్రగతి కార్యక్రమం.. ఈ గ్రామంలో కొత్త వెలుగులు నింపింది. ప్రభుత్వం అందించిన నిధులను పాలకవర్గం, అధికారుల సహకారంతో ప్రణాళికబద్ధంగా ఖర్చు చేసి, పల్లె ప్రగతి పనులను సకాలంలో పూర్తి చేశారు. ఎప్పటికప్పుడు చెత్తను సేకరిస్తూ మెరుగైన పారిశుధ్య నిర్వహణ చేపడుతున్నారు. ఓ వైపు స్వచ్ఛత, మరోవైపు పచ్చదనంతో గ్రామం సరికొత్త కళ సంతరించుకున్నది. సర్పంచ్ మైదం యశోదా గంగారెడ్డి, అందరిని సమన్వయపర్చుకుంటూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు.

### అభివృద్ధిలో ముందు..

ప్రజలు, అధికారుల సమన్వయంతో ప్రభుత్వం నుంచి విడుదలైన నిధులు ఖర్చు చేయడంతో గ్రామ ముఖ చిత్రం మారిపోయింది. ముఖ్యంగా గ్రామంలో రూ.12 లక్షలతో వైకుంఠ ధామాన్ని నిర్మించారు. రూ.2.52 లక్షలతో డంప్ యార్డు నిర్మాణం చేపట్టారు. రూ.80లక్షలతో వాడవాడనా సీసీ రోడ్లు నిర్మించారు. మారుమూల గిరిజన గూడేలు, తండాలకు మిషన్ భగీరథ ద్వారా నీటిని అందిస్తున్నారు. ఇటీవల కాసిపేట ఎత్తిపోతల పథకం మరమ్మతులకు రూ.కోటి 50 లక్షలు మంజూరయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, రూ.20లక్షలతో నూతన జీపీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు.

### ఊరికి సరికొత్త వెలుగు...

కాసిపేట గ్రామంలో రూ.80 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించారు. మరో రూ.9 లక్షలతో వివిధ కాలనీల్లో మురుగులు కాలువలు నిర్మించారు. ప్రభుత్వం మంజూరు చేసిన ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్‌తో పారిశుధ్యం సక్రమంగా ఉంచడంలో వినియోగిస్తున్నారు. ట్రాక్టర్‌తో సేకరించిన తడి, పొడి చెత్తను డంప్ యార్డులో నిల్వ చేస్తున్నారు.

### అందుతున్న సంక్షేమ పథకాలు..

గ్రామంలో 253 మందికి నెలకు రూ.5,44,048 ఆసరా పింఛన్ పొందుతున్నారు. అలాగే ఒక్కో సీజన్‌లో 525 మంది రైతులు పెట్టుబడి కింద రూ.3,92,75,025 రైతు బంధు సాయం అందుకుంటున్నారు. ఇప్పటి వరకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కింద 28 మంది లబ్ధిదారులు రూ.28,03,248 సాయం పొందారు. కేసీఆర్ కిట్ 25 మంది, రైతు బీమా 10 మంది రైతులు, గొర్రెల యూనిట్లను 18 మంది, సీఎం రిలీఫ్ ఫండ్ కింద 50 మందికిపై లబ్ధిపొందారు.

### బీఆర్ఎస్‌తో గ్రామం అభివృద్ధి..



సీఎం కేసీఆర్ హాయంలో, ఎమ్మెల్యే దివాకర్‌రావు సహకారంతో మా గ్రామం అభివృద్ధి చెందింది. పంచాయతీకి ప్రతి నెలా ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో అభివృద్ధి పనులకు ఆటంకం కలగడంలేదు. పల్లె ప్రగతిలో భాగంగా గ్రామంలో పల్లె ప్రకృతివనం, డంప్‌యార్డ్, వైకుంఠధామం నిర్మించుకున్నాం. కొత్త జీపీ పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్‌తో గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకుంటున్నాం.

**- మైదం యశోదా గంగారెడ్డి, సర్పంచ్, కాసిపేట**

### సమస్యలు పరిష్కారమయ్యాయి..



గ్రామంలో చాలా సమస్యలు పరిష్కారమయ్యాయి. గతంలో ఉన్న మట్టి రోడ్ల స్థానంలో సీసీ రోడ్లు వేశారు. పల్లె ప్రగతితో గ్రామ రూపురేఖలు మారిపోయాయి. గతంలో కంటే ఈ ప్రభుత్వం జీపీలకు ఎక్కువ నిధులు సమకూర్చుతున్నది. దీంతో గ్రామంలో అభివృద్ధి పనులకు ఆటంకం కలగడం లేదు. పల్లె ప్రగతిలో భాగంగా పల్లె ప్రకృతి వనం, వైకుంఠధామం, డంప్ యార్డు, క్రీడా ప్రాంగణం నిర్మించారు.

**- కల్లెం రాజు, గ్రామస్తుడు, కాసిపేట**

# అద్భుతం.. గొర్రెల పంపిణీ పథకం

- గొల్ల కురుమలకు అండగా ప్రభుత్వం
- సబ్సిడీపై జీవాలతో ఉపాధి
- కుటుంబాల్లో వెల్లివిరుస్తున్న ఆనందం


జీవాలను మేపుతున్న గొల్లకుర్మ

భీమిని, అక్టోబర్ 24 : గొల్ల కురుమలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అమలుచేస్తున్న గొర్రెల పంపిణీ పథకం.. అద్భుతం సృష్టిస్తున్నది. వారి జీవితాల్లో వెలుగులు నింపింది. అనతి కాలంలోనే గొర్రెల సంపద అమాంతం పెరిగి, శ్రీమంతులను చేసింది. గతంలో ఉపాధి లేక ఇతర రాష్ట్రాలకు వలస పోయేవారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సబ్సిడీ గొర్రెల పంపిణీ ద్వారా గొల్ల కురుమలకు స్థానికంగా ఉపాధి లభించి, వారి దశ మారింది. ప్రభుత్వం 20 గొర్రెలు, ఒక పొట్టేలు అందజేయగా, ఆ సంఖ్య నేడు రెట్టింపయ్యింది. ప్రభుత్వం అమలు చేసిన గొర్రెలను తమ వద్ద ఉంచుకొని వాటికి పుట్టిన వాటిని అమ్ముకుంటూ ఆర్థికంగా లాభపడుతున్నారు. పుట్టిన గొర్రెలను తమ మందలోనే ఉంచడంతో పునరుత్పత్తి పెరిగి పల్లెల్లో ఎక్కడ చూసినా భారీ మందలు కనబడుతున్నాయి. భీమిని మండలంలో మొదటి విడుతలో భాగంగా భీమిని గ్రామంలో 61, చిన్న గుడిపేటలో 83, వీగాంలో 93 మొత్తం 237 యూనిట్లు పంపిణీ చేశారు. రెండో విడుతలో భాగంగా వీగాంలో 55, భీమినిలో 6 మొత్తం 61 యూనిట్లు లబ్ధిదారులకు అందజేయడంతో వారు ఆర్థికంగా అభివృద్ధి చెంది ఉపాధి పొందుతున్నారు.

### స్థానికంగానే విక్రయాలు..

ఒకప్పుడు వివిధ శుభకార్యాల కోసం గొర్రెలు, మేకలు కావాలంటే పక్క జిల్లాలోని సంతలకు వెళ్లి కొనేవారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన గొర్రెల పంపిణీతో ఆ కొరత తీరింది. గొర్రెల సంపద గణనీయంగా పెరగడంతో ఎక్కడ చూసినా సర్కారు పంపిణీ చేసిన గొర్రెలే కనిపిస్తున్నాయి. ఫలితంగా గతంలో కొనుగోళ్లకు పడ్డ ఇబ్బందులు తీరిపోయాయి. స్థానికంగా సంతలు నిర్వహించడంతో ఎక్కడెక్కడి నుంచో వ్యాపారులు ఇక్కడకు వచ్చి కొనుక్కొని వెళ్తున్నారు. కొంత మంది నేరుగా మందల వద్దకు వెళ్లి బేరం చేస్తున్నారు. మధ్యవర్తిత్వం లేకుండా గొల్ల కురుమలు నేరుగా విక్రయించి, ఉపాధి పొందుతున్నారు. నాణ్యమైన మాంసం సైతం అందుబాటులోకి వచ్చిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### బతుకుకు తోవ దొరికింది..



మా తాతల నుంచి జీవాలను నమ్ముకునే బతుకుతున్నం. రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన గొర్రెల వల్ల మా మంద పెద్ద మందగా మారింది. ఇప్పుడు జీవాలకు నీటి గోస లేదు. మేతకు ఇబ్బందులు లేవు. పొట్ట చేతపట్టుకొని వలస పోవుడు బంద్ అయ్యింది. మంచిగా బతుకుతున్నాం. గొల్ల కురుమలం ప్రభుత్వం చేసిన ఈ సాయాన్ని మర్చిపోలేం. కేసీఆర్‌సార్‌కు రుణపడి ఉంటాం.

**- చిర్రం తిరుపతి, భీమిని**

### ఆర్థికంగా నిలదొక్కుకున్నాం..



ప్రభుత్వం కుల వృత్తులకు పూర్వ వైభవం తీసుకువస్తున్నది. గొల్ల కురుమలకు గొర్రెలు పంపిణీ చేస్తూ ఆదుకోవడం ఆనందంగా ఉంది. ప్రభుత్వం నుంచి పొందిన గొర్రెలను మేపుతూ ఆర్థికంగా ఎదిగి, ఒకరిపై ఆధారపడకుండా ఆత్మాభిమానంతో కుటుంబాలను పోషించుకుంటున్నాం. గొల్లకురుమల గురించి ఆలోచించి అభివృద్ధికి కృషి చేసిన కేసీఆర్ సార్‌ను ఎప్పుడూ మర్చిపోం.

**- ముదిగిరి రాజ్‌కుమార్, చిన్నగుడిపేట**

### సర్కారు సాయాన్ని మరువం..



జీవాలను పెంచుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. ప్రభుత్వం చేసిన సహాయానికి రుణపడి ఉంటాం. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన గొర్రెల పంపిణీతో గొర్రెలు, మేకల కొరత తీరింది. గొర్రెల సంపద గణనీయంగా పెరగడంతో ఎక్కడ చూసినా సర్కారు పంపిణీ చేసిన గొర్రెలే కనిపిస్తున్నాయి. కేసీఆర్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు. ఈ పథకంతో కుటుంబాలు బాగుపడ్డాయి.

**- మేకల తిరుపతి, వీగాం**